కూటమి గుప్పిట్లో ఉపాధి

జాబ్ కార్డు కలిగిన కూలీలకు పని కల్పించాలనే లక్ష్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం గత వైఎస్సార్ సీపీ పాలనలో రాజకీయాలకు తావులేకుండా కూలీలకు పనులు లభించాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో సగానికిపైగా మేట్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను తొలగించారు. వైఎస్సార్ సీపీకి ఓట్లేశారంటూ జాబ్‌కార్డులున్న కూలీలకు పనులు కల్పించకుండా ఉపాధి అధికారులే వీరిని పక్కనబెటి, కూటమి నేతల చేతుల్లో కీలుబొమ్మలుగా మారారు. తమకు ఉపాధి పనులు కల్పించాలని వేలాది మంది కూలీలు మండల స్థాయి అధికారుల మొదలు జిల్లా అధికారులను కోరినా, తమను నిష్కారణంగా తొలగించారని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు అధికారుల వద్ద తమ గోడు నివేదించినా అరణ్య రోదనే అయ్యింది.

- కూలీలు, మేట్ల కడుపు కొట్టారు!
- సగానికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల తొలగింపు
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన కూలీలకు పనుల్లేవ్
- జాబ్‌కార్డున్నా ఉపాధి కరువైన కూలీలు
- కూలీలు ప్రాథేయపడినా పనులు కల్పించని ఏపీఓలు
- జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- ఇదీ కుప్పం, పుంగనూరు సీఎల్‌ఆర్సీ పరిధిలో ఉపాధి వెతలు
- 30వేల మంది కూలీలకు పనులు ఇవ్వని వైనం



బైరెడ్డిపల్లె మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూటమి సానుభూతి కూలీలు(ఫైల్) , తమను నిష్కారణంగా విధుల నుంచి తొలగించారని ఫిర్యాదు చేస్తున్న బైరెడ్డిపల్లె మండల ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్)

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో పుంగనూరు, కుప్పం సీఎల్‌ఆర్సీ ప్రాజెక్టులున్నాయి. పుంగనూరు క్లస్టర్‌లో పుంగనూరు, పెద్దపంజాణి, పలమనేరు,గంగవరం, చౌడేపల్లె, బంగారుపాళెం, కుప్పం క్లస్టర్‌లో కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం, వీకోట, బైరెడ్డిపల్లె మండలాలున్నాయి. ఈ రెండు క్లస్టర్లలో మొత్తం 132 పంచాయతీలకు కలిపి హౌస్ హోల్డ్స్ 1,19,898 ఉండగాచ ఉపాధి జాబ్‌కార్డుదారులు 2,16,603మంది ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 70,630మంది పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఈజీఎస్‌లో నీటికుంటల నిర్మాణం, ఫిష్ పాండ్స్, ఫీడర్ ఛానెల్స్, హార్టికల్చర్ ప్లాంటేషన్స్, పశువుల తొట్టెల నిర్మాణం, రోడ్డు పనులు, ట్రెంచిలు, చెక్‌డ్యామ్ పనులు జరుగుతున్నాయి. అయితే గత ప్రభుత్వంలో పనులు చేసిన 30వేల మంది వరకూ ఉపాధి కూలీలకు ఇప్పటి ప్రభుత్వంలో పనులు కల్పించకపోవడంతో కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు.

అధికారులు కాదు.. కూటమి నేతలకు కట్టప్పలు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయా ప్రాంతాల నేతలు చెప్పినట్టు ఈజీఎస్ ఏపీఓలు, ఏపీడీలు నడచుకుంటున్నారు. దీంతో జాబ్‌కార్డులున్న కూలీలకు పనులు లేకుండా పోయాయి. తాము చెప్పినట్టు నడుచుకోకుంటే ఇబ్బందులు తప్పవనే కూటమి నేతల హెచ్చరికలతో ఈజీఎస్ అధికారులు వారికి బాహుబలి సినిమాలో కట్టుబానిస కట్టప్పలా వ్యవహరిస్తున్నారు.

60 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 60మంది మేట్లు ఔట్!

పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో 132మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పనుల్లో విధులు నిర్వర్తించేవారు. వీరిలో 60మందికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నోటీసులు కూడా ఇవ్వకుండానే తొలగించారు. వారి స్థానంలో అధికార పార్టీకి అనుకూలమైన వారిని కూటమి నేతలు నియమించారు. వీరు జేసీబీలతో పాత గుంతలకే పైపైన చెక్కి, బినామీ కూలీల పేరిట బిల్లులు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరికి ఆయా ప్రాంతాల్లో ఏపీఓల సాయం ఉండడంతో అక్రమంగా పనులు చేసినా సక్రమంగా బిల్లులవుతున్నట్టు సమాచారం.

ఆందోళన చేసినా మొండిచెయ్యే

ఉపాధి పనులు చేసుకునే తమకు రాజకీయాలతో సంబంధం లేదని తమకు జాబ్‌కార్డులున్నాయని పని కల్పించండి మహాప్రభో అని కూలీలు ఇప్పటికే పలు మండలాల్లో మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ వరకూ తమ గోడు నివేదించారు; వినతిపత్రాలిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసినా వారికి ఏ అధికారీ ఉపాధి కల్పించిన పాపానపోలేదు.

తొలగించడంతో అష్టకష్టాలు


గత ప్రభుత్వంలో నేను ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎంతోమందికి జీవనాధారంగా ఉన్నా. కానీ కూటమి ప్రభుత్వంలో నన్ను తొలగించి మా కడుపు కొట్టారు. మా మండలంలో 19 పంచాయతీల్లో 18మంది ఎఫ్ఏలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. వందలాదిమంది కూలీలకు పనులు ఇవ్వలేదు. ఇప్పుడు మా కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఇక కూలీల పరిస్థితి చెప్పనక్కరలేదు.

-రాజేశ్వరి, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, పుదిపట్ల, చౌడేపల్లె మండలం

మా ఉసురు తగులుతుంది


ఏడేళ్లుగా ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నన్ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బలవంతంగా రాజీనామా చేయించారు. ఇప్పుడు ఎలాంటి ఉపాధి లేక గ్రామంలో కొంత పొలం కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. మా ఉసురు ఈ ప్రభుత్వానికి తగలకమానదు.

-మణి, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, వెంగలపల్లె, చౌడేపల్లె మండలం

కడుపు కొట్టి..బతుకు లేకుండా చేసి..


ఫీల్డ్ అసిస్టెంట్‌గా మా పంచాయతీలో పని చేస్తున్న నన్ను కూటమి ప్రభుత్వం రాగానే అకారణంగా నన్ను తీసేశారు. ఇదేంటి సార్? అని అధికారులను కలిస్తే కూటమి నేతలు తీసేయమన్నారు.. ఏమన్నా ఉంటే వాళ్లతో మాట్లాడుకోమని మాపై అధికారులు చెబుతున్నారు. ఇదేమి న్యాయం సార్? గత ప్రభుత్వంలో ఎంతోమందికి ఉపాధి కల్పించిన నాకే బతుకు లేకుండా చేశారు.

-సుబ్రమణ్యం, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, జీసీపల్లె, బైరెడ్డిపల్లె మండలం

ఇక న్యాయస్థానాలే దిక్కు


ఎన్నికలు వస్తే పార్టీలు మారుతుంటాయి. అయినా రాజకీయాలకు మాకు సంబంధం ఏంటి? కనీసం ఎందుకు తొలగిస్తున్నారో నోటీసైనా ఇవ్వకుండా ఆపేశారు. అందుకే మేము న్యాయం కోసం కోర్టుకెళతాం . మరీ అధికారులు దిగజారి కూటమి నేతలు చెప్పినట్లు నడచుకోవడం చూస్తుంటే కడుపు మండిపోతోంది.

-మధు, మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, లక్కనపల్లె, బైరెడ్డిపల్లె మండలం

గత ప్రభుత్వంలో ఎంతోమందికి ఉపాధి


గత ప్రభుత్వంలో ఉపాధి పనులకు సంబంధించి ఎలాంటి రాజకీయాలు లేవు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులు పొందారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీల ప్రకారం పనుల ఇస్తున్నారు. అధికార పార్టీ వాళ్లు చెప్పిన కూలీలకే పనులు.. అక్రమంగా బిల్లులు.. వారి ఇష్టానుసారంగా పనులు చేస్తున్నా అధికారులు వారికే సపోర్టుగా ఉంటున్నారు.

-వెంకటరమణ, దేవదొడ్డి, బైరెడ్డిపల్లె మండలం

కూటమి పాలనలో ఉపాధి అంతా అక్రమాలే


నేను ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఐదేళ్లు పని చేశా. మా పంచాయతీలో రూ.4కోట్ల విలువైన పనులు చేయించి కూలీలకు ఉపాధి కల్పించాం. కూటమి ప్రభుత్వం రాగానే నన్ను తొలగించారు. ఇప్పుడు వారికి కావాల్సిన వారిని పనుల్లో పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. నిజమైన కూలీలకు పనులు లేక ఇతర పనులకు వెళుతున్నారు. ఎంతోమంది కూలీల కడుపు కొట్టారు.

-క్రిష్ణమూర్తి, కొత్తపల్లె, గంగవరం మండలం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు


ప్రత్యేక పూజలందుకున్న గంగమ్మ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధిచేసి, అర్చనలు, అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

కొలతల్లో తేడా వస్తే ఇంటికే..!

-డీలర్లకు తహసీల్దార్ హెచ్చరిక

రొంపిచెర్ల: చౌక దుకాణాలలో నిత్యావసర సరుకుల పంపిణీ పరంగా కొలతల్లో తేడా వచ్చినా, లబ్ధిదారులు ఫిర్యాదు చేసినా డీలర్లను ఇంటికి పంపుతామని తహసీల్దార్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. చౌక దుకాణాలలోని మరమ్మతులకు గురైన వేయింగ్ మెషిన్లను శుక్రవారం సిద్ధం చేయించి ఆయన మాట్లాడారు. మండలంలోని 28 చౌక దుకాణాలు ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరుకులను పంపిణీ చేయాలన్నారు నిత్యావససర సరుకుల ధరల పట్టికను ఉంచాలన్నారు.

నివాళి


నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట :మండలంలోని ఎస్ బండపల్లెకు చెందిన మాజీ ఎంపీటీసీ శివరాం సతీమణి వెంకటలక్ష్మి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి వెంకటలక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శివరాం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హెచ్‌ఎంలుగా ఇద్దరికి ఉద్యోగోన్నతి

-పలువురు హెచ్‌ఎంలు బదిలీ

రొంపిచెర్ల: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మానసాల, బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న మోహన్‌రెడ్డికి స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించినట్టు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. అలాగే మానసాలను కడపనెత్తం ఉన్నత పాఠశాలకు, మోహన్‌రెడ్డిని అడవి బూదగూరు ఉన్నత పాఠశాలకు బదిలీ చేవారని, అలాగే రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవిని పులిచెర్ల ఉన్నత పాఠశాలకు, ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్‌ను అన్నమ్మయ్య జిల్లా కలికిరి మండలం మంచూరు ఉన్నత పాఠశాలకు, బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హేమావతి తిరుపతి జిల్లాలోని నరసింగాపురం ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారని తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ధనలక్ష్మి బదిలీపై రానున్నట్టు చెప్పారు.. మండలంలో 82 మంది టీచర్లు బదిలీలకు దరఖాస్తు చేసుకోగా, వీరిలో 42 మంది మాత్రమే బదిలీకి అర్హత ఉందన్నారు.

6న బహిరంగ వేలం

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో శిథిలమైన రెండు బాలికల వసతి గృహ భవనాలను తొలగించడానికి జూన్ 6న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. ఆసక్తిగల వారు జూలై 5వ తేదీ లోపు ధరావత్తు రూ.10వేలు, ప్రవేశ రుసుం రూ.3 వేలను ద ప్రిన్సిపాల్, ఏపీఆర్ స్కూల్, కమ్మనపల్లె పేరిట డీడీలను అందజేయాలన్నారు. వివరాలకు 8712625057 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వాసవీమాత ఆలయంలో హోమపూజలు


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

పట్టణంలోని వాసవీమాత ఆలయంలో నిర్వహిస్తున్న 12వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం గోపూజ, గణపతిపూజ, అమ్మవారి మూలమంత్ర హోమం, వేదపారాయణం, అమ్మవారి సహస్రనామ హోమాలు మొదలైనవి శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వి.కోట


హోమం చేస్తున్న పండితులు

‘స్థానిక’ విజయమే అందరి లక్ష్యం


బుద్ధిమాంద్యం పిల్లలతో కేక్ కట్ చేస్తున్న చెంగారెడ్డి

పలమనేరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడమే లక్ష్యంగా అందరూ ముందుకెళ్లాలని ఏరియా ఆస్పత్రి మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత ఆర్ చెంగారెడ్డి అన్నారు. చెంగారెడ్డి జన్మదినం పురస్కరించుకుని ఆయన అభిమానులు శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వేడుకలు నిర్వహించడంతో పాటు పట్టణ సమీపంలోని బుద్ధిమాంద్యం పిల్లలకు అన్నదానం చేశారు. తొలుత వారితో కేక్ కట్ చేయించారు. నియోజకవర్గంలో పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు హేమంత్‌కుమార్‌రెడ్డి, బాలాజీనాయుడు, బాగారెడ్డి, నేతలు మోహన్‌రెడ్డి, మురళీకృష్ణ, భాస్కర్‌రెడ్డి, కోదండరామయ్య, వైవీఆర్ రెడ్డి సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

రాయితీపై మామిడి ఊజీ బుట్టలు

- సదుం: మామిడి రైతులకు రాయితీ ధర్పై ఊజీ బుట్టలు పంపిణీ చేస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి సంతోషికుమారి శుక్రవారం తెలిపారు. ఒక్క ఊజీ బుట్ట, మూడు మాత్రలు రూ.11కే ఇస్తామన్నారు. ఎకరాకు మూడు బుట్టల చొప్పున గరిష్ఠంగా ఒక రైతుకు 40 బుట్టలు మాత్రమే ఇస్తామని, సదుం, సోమల, చౌడేపల్లె, పులిచర్ల, రొంపిచర్ల మండలాల రైతులు పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్‌తో చౌడేపల్లెలోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా శిక్షణ ఇస్తున్న మాస్టర్లు

బైరెడ్డిపల్లె: రోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీఓ రాజేంద్రబాలాజి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇస్తున్న యోగా శిక్షణకు ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ, ప్రభుత్వ శాఖల సిబ్బంది, యోగా మాస్టర్లు బాలాజి, శాంతి, అమరావతి, ఏపీఓ హరినాథ్, ఎంఈఓ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, చంద్రశేఖర్, బాలాజి, సురేష్ పాల్గొన్నారు.



● కల్యాణోత్సవం


మండలంలోని అమ్మగారిపల్లెలో శుక్రవారం సీతారాము కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేసిన వేదపండితుల శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. -సదుం

చౌక దుకాణం తనిఖీ

సదుం: మండల కేంద్రంలోని చౌక దుకాణాన్ని తహసీల్దార్ జయప్రకాశ్ శుక్రవారం తనిఖీ చేశారు. జూన్ 1 నుంచి రేషన్ షాపులలోనే సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా నిత్యావసర సరుకులు కార్డుదారులకు ఇవ్వాలని డీలర్లను ఆదేశించారు. మండల వ్యాప్తంగా 31 రేషన్ షాపుల పరిధిలో 10,555 కార్డులున్నాయని ఆయన చెప్పారు. పంపిణీపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ కుమార్ పాల్గొన్నారు.

